క్లుప్తంగా

సంతబయలులో అంధకారం



చీకటిగా ఉన్న సంతబయలు రహదారి

తగరపువలస: స్థానిక ప్రయివేట్ మార్కెట్‌ను ఆనుకుని ఉన్న సంతబయలు రహదారిలో వీధి దీపాలు వెలగడం లేదు. ఈ మార్గంలో పలు వ్యాపార సంస్థలు ఉండటంతో దుకాణాలు తెరిచి ఉన్న సమయంలో మాత్రమే వాటి వెలుగు రహదారిపై ఉంటుంది. దుకాణాలు మూసివేసిన తరువాత అంధకారంగా మారిపోతోంది. దీంతో తరచూ ఈ మార్గంలో దుకాణాలలో చిరు దొంగతనాలు జరుగుతున్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని వీధిదీపాలు పునరుద్ధరించాలని సంతబయలు ప్రాంత వ్యాపారులు, ఇళ్ల యజమానులు కోరుతున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న క్రైం ఎస్‌ఐ

భీమునిపట్నం: పండగ వేళ చోరీలు జరిగే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భీమిలి క్రైం ఎస్‌ఐ సూర్య ప్రకాశ్ అన్నారు. శనివారం మెయిన్‌రోడ్డులో ప్రజలకు అవగాహన కల్పించారు. చాలామంది ఊళ్లకు వెళ్లే సమయాల్లో బంగారు ఆభరణాలు, డబ్బు ఇళ్లవద్దే ఉంచి వెళుతుంటారని ఇది సరికాదని అన్నారు. వీటిని బ్యాంకు లాకర్లు లేక సురక్షితంగా ఉండే చోట ఉంచుకోవాలన్నారు. ఎవరైనా ఊరు వెళితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. చైన్ స్నాచర్స్ తిరుగుండడంతో మహిళలు విలువైన ఆభరణాలను ధరించి బయటకు రావొద్దన్నారు.

సమయం వృథా చేయవద్దు



విద్యార్థినికి కాంపిటేటివ్ బుక్ అందజేస్తున్న సమగ్ర శిక్షా జిల్లా ఏపీసీ శ్రీనివాసరావు

పద్మనాభం: సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సమగ్ర శిక్షా జిల్లా ఏపీసీ బి.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని అనంతవరం, కొత్త కొవ్వాడ, పద్మనాభం గ్రామాల్లో శనివారం పర్యటించారు. భీమునిపట్నం, పద్మనాభం, ఆనందపురం కస్తూర్బా విద్యార్థినుల ఇళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి శ్రీనివాసరావు మాట్లాడుతూ సమయం చాలా విలువైనదని తెలిపారు. దసరా సెలవుల్లో ఇచ్చిన ప్రాజెక్టును పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు కాంపిటేటివ్ బుక్సును అందజేశారు.

జూలో సందడి



నీటి ఏనుగులను చూస్తున్న సందర్శకులు

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో దసరా సందడి నెలకొంది. పాఠశాలలు, కళాశాలలకు సెలవులు కావడంతో జూకు సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటోంది. రెండు రోజులుగా పిల్లలను తీసుకొని ఎక్కువ మంది తల్లిదండ్రులు జూని సందర్శిస్తున్నారు. ఎక్కువగా కోతులు, ఏనుగులు, పులులు, నీటి ఏనుగుల ఎన్‌క్లోజర్లు, పక్షులు, పాముల జోన్‌ల వద్ద పిల్లలు ఎక్కువగా సందడి చేస్తున్నారు. ఇక్కడ వన్యప్రాణులను చూడడంతో పాటు మధ్యలో ఉన్న ఆట స్థలాల్లో సరదాగా ఆడుకుని రోజంతా గడుపుతున్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ముంగిటకే వైద్యం



సంతపేటలో లబ్ధిదారులకు కేస్‌షీట్లు అందజేస్తున్న జెడ్పీ రామా



వెల్లంకి వైద్య శిబిరంలో రోగుల రద్దీ

ఆనందపురం : జగనన్న ఆరోగ్య సురక్షతో పేదల ఇంటి ముంగిటకే వైద్యం అందుతోందని జిల్లా వైద్య ఆరోగ్యాధికారి జగదీశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని వెల్లంకిలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కోరాడ మాట్లాడుతూ గతంలో జబ్బు నిర్ధారణకే వారం రోజులు పట్టేదని..నేడు గ్రామంలోనే గంటల వ్యవధిలోనే రిజల్టు వస్తోందన్నారు. వైద్య సేవలు మెరుపడడంతోపాటు సేవల్లో వేగం పెరిగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. జిల్లా వైద్య ఆరోగ్యాధికారి జగదీశ్వర రావు మాట్లాడుతూ శిబిరంలో నమోదైన ప్రతి ఒక్కరికీ కేస్‌షీట్ అందిస్తున్నామన్నారు. అందులో అనారోగ్యానికి సంబంధించిన అన్ని వివరాలు ఉంటాయని, వాటి ద్వారా భవిష్యత్తులో వైద్య సేవలు పొందవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా 675 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 11 మందికి కంటి ఆపరేషన్లు, మరో 32 మందికి వివిధ రకాల చికిత్సలు అవసరమని గుర్తించి పెద్దాస్పత్రులకు రిఫర్ చేశారు. మిగతా వారికి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అడపా లవరాజు, సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, వైఎస్సార్ సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, పంచాయతీ కార్యదర్శి మూర్తి, నాయకులు పిన్నింటి వెంకటరమణ, కాకర వెంకటరమణ, కంచరాపు శ్రీనివాసరావు, చెన్నా సత్యం, కె.చంద్రమౌళి, పడాల రాము, తోనంగి అప్పారావు రెడ్డి, బుల్లిరెడ్డి పాలగొన్నారు.

విశేష స్పందన

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు ఆదర్శనగర్-2 సచివాలయం పరిధిలో శనివారం సంతపేట చిల్డ్రన్స్‌పార్కులో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ శిబిరాన్ని భీమిలి జెడ్పీ బి.రాము ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య శిబిరాలకు వస్తున్న స్పందనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరు నెలలకు ఒకసారి వీటిని నిర్వహించనున్నట్టు ప్రకటించారన్నారు. వీటిని ప్రజలంతా సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆయన వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి లబ్ధిదారులకు మందులు, కేస్‌షీట్లు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇంచార్జ్ శిల్లా సరళాణి, కరుణాకరరెడ్డి, వార్డు సచివాలయాల అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్, వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, వార్డు ప్రధాన కార్యదర్శి చిప్పాడ వెంకటేష్, శిష్టకరణాల రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు డబ్బీరు ప్రశాంతి, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు నమ్మి లక్ష్మణరావు, మాజీ కౌన్సిలర్ చేట్ల ఎల్లయ్యరెడ్డి, సీనియర్ నాయకులు పీతల వెంకట అప్పారావు, చిల్ల సూర్యనారాయణరెడ్డి, జగన్నాథ ఎల్లాజీ, కంచుబోయిన వెంకటరావు, చిల్ల ప్రమీల, జీరు పద్మ, చేట్ల అప్పలసూరమ్మ తదితరులు పాల్గొన్నారు.



వైద్యులకు సూచనలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో

మారుమూల గ్రామాల్లో 4జీ టవర్ల నిర్మాణం



బంగ్లామెట్టపై బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్



సెల్ టవర్ వద్ద ఏర్పాటు చేసిన కొత్త బ్యాటరీ యూనిట్

తగరపువలస: మారుమూల గ్రామాల్లో 4జీ టవర్ల నిర్మాణం ప్రారంభించినట్టు టెలికాం జేఈ వీవీఎస్ సత్యనారాయణ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆత్మ నిర్భర్ భారత్ అభియాన్ పథకంలో భాగంగా భీమిలి నియోజకవర్గంలో ఐదు చోట్ల 4జీ టవర్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు.ఆనందపురం మండలం శివారులోని దబ్బందలో 2, రామవరం, ఇచ్ఛాపురం, గోరింట పంచాయతీల్లో ఒక్కొక్కటి నిర్మిస్తున్నట్టు తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాల్లో 4జీ టవర్లు 700 వరకు నిర్మాణం జరుగుతున్నాయన్నారు. వీటి నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే స్థలాలు కేటాయిస్తుందన్నారు. నివాసాల మధ్య సెల్ టవర్ల నిర్మాణం వలన ఎలాంటి హాని లేదన్నారు. ఇదంతా ప్రజల అపోహ మాత్రమేనన్నారు. మిగిలిన నెట్ వర్క్‌లతో పోలిస్తే బీఎస్ఎన్ఎల్ చవకైనదే కాకుండా ఆధార్, బ్యాంకు ఖాతాల లింకేజీకి సురక్షితమైనదని సత్యనారాయణ తెలిపారు.

సిగ్నల్స్‌కు లేదిక అంతరాయం

బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగినప్పుడు అక్కడి బ్యాటరీ యూనిట్లు పనిచేయకపోతే వినియోగదారులకు కలిగే అసౌకర్యాన్ని ఇప్పుడు ఆ సంస్థ భర్తీ చేసింది. బ్యాటరీ యూనిట్లు కాలిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పుడు ఆ సంస్థ వినియోగదారులకు కాల్స్‌తో పాటు నెట్‌వర్క్ నిలిచిపోయేది. వినియోగదారుల ఫిర్యాదులతో ఇప్పుడు నిరంతరాయం సేవలు అందుతున్నాయి. ఇటీవల కాలంలో భీమిలి డివిజన్‌లో జీవీఎంసీ పరిధిలోని ఒకటో వార్డు బంగ్లామెట్ట, నాలుగోవార్డు తొట్లకొండ, భీమిలి మండలం దాకమర్రి, పద్మనాభం, ఆనందపురం మండలంలోని తర్లువాడలో ఈ అంతరాయం కలిగేది. వీటిలో నాలుగు గ్రామీణ ప్రాంతానికే చెందినవి కావడం, మిగతా నెట్‌వర్క్‌లు ఏమీ అందుబాటులో లేకపోవడంతో బీఎస్ఎన్ఎల్ తక్షణం స్పందించవలసి వచ్చింది.

ఇంకా ముఖ్యంగా తొట్లకొండ ప్రాంతంలో ఏర్పాటు చేసిన టవర్ సమీపంలో రక్షణకు సంబంధించిన గ్రే హౌండ్స్ కొండల మధ్య ఉండటంతో అత్యంత వేగంగా బ్యాటరీ యూనిట్‌ను పునర్నిర్మించవలసి వచ్చింది. ఈ అయిదు చోట్ల సుమారు రూ.5 లక్షల విలువైన బ్యాటరీ యూనిట్లు అమర్చినట్టు టెలికాం జేఈ వీవీఎస్ సత్యనారాయణ తెలిపారు. వీటి ఏర్పాటుకు బీఎస్ఎన్ఎల్ జిల్లా జనరల్ మేనేజర్ పాల్ విలియం తక్షణం స్పందించారన్నారు.

నిర్మాణాల కూల్చివేతపై ఫిర్యాదు

తగరపువలస: భీమిలి మండలం రేఖవానిపాలెం పంచాయతీ సర్వేనంబర్ 3/2లో నిర్మించిన డ్రైనేజీ, రహదారి, కల్వర్టులను పంచాయతీ వాసులతో పాటు జీవీఎంసీకి చెందిన వారు కూల్చివేశారని ఆరోపిస్తూ నగరానికి చెందిన హెచ్‌వీఎస్ ప్రసన్నకుమార్ శనివారం సాయంత్రం భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2004లో రాయపాలేనికి చెందిన మల్లేటి చిట్టిబాబు నుంచి 95 సెంట్ల స్థలం కొనుగోలు చేసి డెవలప్‌మెంట్‌లో భాగంగా ఇటీవల తన ప్రతినిధుల సాయంతో డ్రైనేజీ, కల్వర్టు, రహదారి నిర్మిస్తున్నామన్నారు. దీనికి పంచాయతీ నుంచి అనుమతి కూడా తీసుకున్నామన్నారు. తాను నిర్మాణం చేపట్టిన చోట గోర్జి ఉండేదన్నారు. ఈ నెల 20న పి.రవి, ఇ.గోవింద్, టి.వెంకట సత్యనారాయణ, భాస్కరరెడ్డి వారి అనుచరులతో వచ్చి తమవారితో గొడవపడి దాడి చేసి నిర్మాణాలను జేసీబీతో ధ్వంసం చేయించారన్నారు. వీరిపై చర్యలు తీసుకోవాలని భీమిలి పోలీసులను లిఖిత పూర్వకంగా కోరినట్టు ప్రసన్నకుమార్ తెలిపారు.



నిర్మాణాలు ధ్వంసం చేసిన దృశ్యం

కారు బోల్తా- వ్యక్తి మృతి

భీమునిపట్నం: భీమిలి బీచ్‌రోడ్డులోని ఐఎస్ఎస్ కళింగ సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి కారు బోల్తాపడిన ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. నాలుగో వార్డు పరిధిలోని నేరెళ్లవలస గ్రామానికి చెందిన ఓళ్ల నర్సింహరాజు (38) భోగాపురం సమీపంలోని ఒక ఆక్వా కంపెనీలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. తన స్నేహితులతో కలిసి శుక్రవారం కారులో తగరపువలసలో సెకెండ్ షో సినిమాకు వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో ఐఎన్ఎస్ కళింగ సమీపంలోకి వచ్చే సరికి కారు డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న నర్సింహరాజు తలకు గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్నేహితులు కుమార్, లక్ష్మణ్, ప్రతాప్‌కు స్వల్పగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు నర్సింహరాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ భరత్‌కుమార్‌రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



బోల్తాపడ్డ కారు (ఇన్‌సెట్) మృతిచెందిన నర్సింహరాజు (ఫైల్)

జనసేన ఆరోపణలు అవాస్తవం

మధురవాడ: జీవీఎంసీ 6వ వార్డు మధురవాడ ఎమ్ఎస్ఆర్ లే అవుట్‌లో బటర్ ఫ్లై థీమ్ పార్కు సుందరంగా నిర్మాణం చేస్తుంటే జనసేన నాయకులు తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని వైఎస్సార్‌సీపీ 7వ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకుడు పిళ్లా సూరిబాబు, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, మాజీ సర్పంచ్ కుడితి రామారావు తదితరులు పేర్కొన్నారు. మధురవాడ ఎమ్ఎస్ఆర్ లే అవుట్ వద్ద శనివారం సాయంత్రం నిర్మాణంలో బటర్ ఫ్లై థీమ్ పార్కు వద్ద మీడియాతో మాట్లాడారు. ఈ పార్కును ఆనుకుని పిళ్లా లక్ష్మణ పాత్రుడు, పోతిన అప్పారావుకు సంబంధించి భూ బదలాయింపు అంశం పరిశీలనలో ఉందని, కౌన్సిల్ కూడా ఆమోదం పొందిందన్నారు. జనసేన నాయకులు రాజకీయ లబ్ధి కోసం బ్లాక్ మెయిల్ ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఇలాంటి తప్పుడు ఆరోపణలు కట్టిపెట్టాలన్నారు. కార్యక్రమంలో 6వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, పోతిన ఎల్లాజీ, పీవీజీ అప్పారావు, ఎస్. బాబ్జి, పోతిన పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

దేదీప్యమానంగా దీపారాధన



దీపాలు వెలిగిస్తున్న భక్తులు

మధురవాడ: దీపాలు కాంతితో మధురవాడ టైలర్స్ కాలనీలోని శ్రీ విజయ దుర్గా ఆలయం శనివారం సాయంత్రం దేదీప్యమానంగా వెలిగిపోయింది. శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయం వద్ద భారీ దీపారాధన నిర్వహించారు. జీవీఎంసీ మధురవాడ జోన్-2 కమిషనర్ కనక మహాలక్ష్మి దీపారాధనను ప్రారంభించారు. అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరించారు. కార్యక్రమంలో ధర్మకర్త బంగారు సుబ్బారావు, లక్ష్మి దంపతులు, బంగారు ప్రకాశ్, అశోక్ కుమార్, ఝాన్సీ, మాధవి పాల్గొన్నారు.

130 మందికి వైద్య పరీక్షలు

పద్మనాభం: కృష్ణాపురం కాలనీలో శనివారం ఎలివేటెడ్ లైఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 130 మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరాన్ని వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు మొకర అప్పలనాయుడు ప్రారంభించారు. వైద్యులు ప్రభాకర్, వరప్రసాద్ ఈ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎలివేటిట్ లైఫ్ డైరెక్టర్ జాన్ విక్టర్, ఎంపీటీసీ కో-ఆప్షన్ మెంబర్ దున్న అబ్రహం, జి.శామ్యూల్ పాల్గొన్నారు.

లలితా త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు



సంగివలసలో మహిళల గీతాపారాయణ



బక్కన్నపాలెంలో పూజలు చేస్తున్న భవానీలు



మానం ఆంజనేయులు నగర్‌లో..

తగరపువలస: శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శనివారం భీమిలి పరిధిలోని ఆలయాలు, మండపాలలో అమ్మవారిని లలితా త్రిపుర సుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సంగివలస పోలమాంబ అమ్మవారి ఆలయంలో భక్తులు కొత్తమ్మ, మారిడిమాంబ, ముత్యమాంబ అమ్మవార్లను దర్శించుకున్నారు. ఇక్కడ దేవాదాయశాఖ ఆధ్వర్యంలో పండితులచే చండీ హోమం ప్రారంభమయింది. ధర్మ ప్రచార వారోత్సవాల్లో భాగంగా మహిళలు గీతాపారాయణం చేశారు. సంతపేట గ్రామదేవత కొత్తమ్మవారిని లలితా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించారు. చిట్టివలస రెడ్డివీధిలో అమ్మవారిని పసుపు కొమ్ములతో అలంకరించారు. భీమిలి రోడ్డులోని ఆంధ్రా బ్యాంకు కూడలిలో అర్చకుడు సోమయాజుల కల్యాణ చక్రవర్తి ఆధ్వర్యంలో లలితాదేవికి విశేష కుంకుమార్చన, నవదుర్గా హోమాలు నిర్వహించారు. భీమిలి మండలం పాత మూలకుద్దులో అమ్మవారిని తమలపాకులతో అలంకరించారు.

దుర్గా దేవి అలంకరణలో బబ్బేలమ్మ

పీఎంపాలెం: కారుషెడ్ సమీంపలోని బబ్బేలమ్మ ఆలయంలో అమ్మవారు శనివారం దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు ప్రదీప్ శర్మ పర్యవేక్షణలో అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. అలాగే బక్కన్నపాలెం రోడ్డులో ఉన్న శ్రీ శృంగేరీ శంకర మఠంలో శారదాంబ అమ్మవారు పుష్పాలంకరణలో దర్శనమిచ్చారు.

దుర్గాలమ్మకు విశేష పూజలు

మధురవాడ: శరన్నవరాత్రి ఉత్సవాలు మధురవాడలోని వివిధ ప్రాంతాల్లో వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం అమ్మవారు భక్తులకు శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవిగా దర్శనం ఇచ్చారు. ఇందులో భాగంగా బక్కన్నపాలెం-పీఎంపాలెం రోడ్డులోని శ్రీ దుర్గాలమ్మ ఆలయం సముదాయంలో అమ్మవారిని విశేషంగా గజమాలలో అలంకరించారు. ప్రధాన అర్చకుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ 6వ వార్డు యువజన విభాగం అధ్యక్షుడు పోతిన మూర్తిబాబు, కమిటీ ప్రతినిధులు అప్పలరాజు, వెంకటరామారావు, నాని, వెంకట్, శ్రీను ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- వైఎస్సార్ కాలనీలో దుర్గాదేవి ఆలయంలో అప్పారావు భవానీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు బండారు శివలక్ష్మి, డి. రాధ పాల్గొన్నారు.
- చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయం జీవీఎంసీ జోన్-2 కమిషనర్ కనక మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. చంద్రంపాలెం గ్రామానికి చెందిన రామ లక్ష్మణ లారీ ఓనర్స్ పిళ్లా లక్ష్మణ, లక్ష్మి, పిళ్లా వెంకటరమణ, వరలక్ష్మి కుటుంబ సభ్యులు సహాయ సహకారాలు భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.
- ఐటీ సెజ్ జంక్షన్ సమీపంలోని మానం ఆంజనేయులు నగర్‌లోని శ్రీ లలితా త్రిపుర సుందరీ సమేత మహా కామేశ్వర స్వామి ఆలయంలో లలితా త్రిపుర సుందరీ అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేసి, కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బొడ్డేపల్లి సురేష్, అప్పారావు, ప్రతాపరాజు తదితరులు విశేష పూజలు నిర్వహించారు.

పలు చోట్ల అన్నదానం

మధురవాడ: శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బక్కన్నపాలెం దుర్గాలమ్మ ఆలయ సముదాయం, స్వతంత్రనగర్ శ్రీ లక్ష్మీదేవమ్మ ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించారు. బక్కన్నపాలెం శ్రీ దుర్గాలమ్మ ఆలయ సముదాయంలో బక్కన్నపాలెం ప్రజల సహకారాలుతో ఏర్పాటు చేసిన అన్న ప్రసాద పంపిణీని ఉత్సవ కమిటీ ప్రతినిధులు పోతిన మూర్తిబాబు, అప్పలరాజు, వెంకటరామారావు, నాని, వెంకట్ ప్రారంభించారు.



చిట్టివలస రెడ్డివీధిలో పసుపు కొమ్ముల అలంకరణలో అమ్మవారు



భీమిలి రోడ్డులో లలితా త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు



పుష్పాలంకరణలో శృంగేరీ మఠం శారదాంబ



లలితా త్రిపుర సుందరీదేవిగా సంతపేట కొత్తమ్మతల్లి

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శనలో కళాకారులు

పీఎం పాలెం: దసరా ఉత్సవాలు సందర్భంగా శిల్పారామం శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విజయనగరానికి చెందిన శ్రీ విజయా నృత్య కళానికేతన్‌లో శిక్షణ పొందుతున్న సుమారు 30 మంది బాల కళాకారులు కూచిపూడి, జానపద నృత్యాలతో ఆకట్టుకున్నారు. జానపద నృత్యాలలో కైకలూరు చిన్నది.., మామా బంగారు మామ, కొయిరాలే తదితర గీతాలకు హుషారుగా నృత్యం చేసి ఆకట్టుకున్నారు. కళాకారులు హేమలత, పుష్పలత, నమ్రత, దీపిక, ఉజ్వల, పూజిత, హర్షిత, పల్లవి, వెన్నెల, కీర్తిక, దీక్షిత, చందన, తేజశ్రీ, తనుశ్రీ, యక్షిత, తనుశ్రీ, శ్రీనిధి, వైష్ణవి పాల్గొనగా బాబులు మాస్టారు నృత్య దర్శకత్వం వహించారు. కార్యక్రమాన్ని స్థానిక పరిపాల అధికారి టి.విశ్వనాథరెడ్డి పర్యవేక్షించారు.

ప్లీజ్ బస్సులు ఆపండి..!

తగరపువలస: దసరా ఎఫెక్ట్ స్థానికంగా బస్సులను ఆశ్రయించే ప్రయాణికులపై అప్పుడే పడింది. విశాఖ నుంచి విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాలవైపు వెళ్లే ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌లు కిక్కిరిసి వెళ్తున్నాయి. అంతేకాకుండా వీటిని తగరపువలసలో ఎక్కడా ఆపకుండా వెళ్లిపోతుండటంతో ప్రయాణికులు సంగివలస, వెంకటేశ్వరమెట్ట వద్ద గంటల తరబడి రోడ్లపై నిరీక్షిస్తున్నారు. ముఖ్యంగా పార్వతీపురం, బొబ్బిలి, పలాస, టెక్కలి, రాజాం, ఇచ్ఛాపురం వంటి దూర ప్రాంతాలలో సొంత ఇళ్లకు, బంధువుల ఇళ్లకు వెళ్లేవారు అనేక కష్టాలు పడుతున్నారు. విధి లేని పరిస్థితులలో విజయనగరం వెళ్లే సిటీ సర్వీసులు, శ్రీకాకుళం ప్యాసింజర్ బస్సులు ఎక్కి అక్కడ నుంచి మరో బస్సులు అందుకుంటున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సులు ఆపేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పంచాయతీ కార్యదర్శులకు ఈవోఆర్డీలుగా పదోన్నతి



రఘుపతిరావు



మల్లేశ్వరరావు

పద్మనాభం: మండలంలోని రెండు పంచాయతీలకు చెందిన కార్యదర్శులకు ఈవోఆర్డీలుగా పదోన్నతి లభించింది. పద్మనాభం పంచాయతీ కార్యదర్శి అరసాడ రఘుపతిరావుకు ఈవోఆర్డీగా పదోన్నతి కల్పిస్తూ శ్రీకాకుళం జిల్లాకు, మద్ది పంచాయతీ కార్యదర్శి పసుమర్తి మల్లేశ్వరావుకు ఈవోఆర్డీగా పదోన్నతి కల్పిస్తూ అల్లూరి మన్యం జిల్లాకు బదిలీ చేశారు.